క్లుప్తంగా

మాజీ ఎంపీపీకి ఎంపీ బోస్ పరామర్శ


సూర్యనారాయణను పరామర్శిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం: రోడ్డు ప్రమాదానికి గురై రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామచంద్రపురం మండల మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. సూర్యనారాయణకు మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌ను కోరారు. ఎంపీ బోస్ వెంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, శెట్టిబలిజ సంఘ పెద్దలు కడలి రామకృష్ణ, వాసంశెట్టి లక్ష్మీనారాయణ, పాలిక అప్పారావు, సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ హోమం


స్వామివారి సేవలో తరిస్తున్న భక్తులు

మండపేట: అర్తమూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీనరసింహ హోమం నిర్వహించారు. గొలుగూరి శ్రీనివాసరెడ్డి, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కొండూరి వెంకటరమణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం జరిపారు. భక్తులకు లక్ష్మీ వస్త్రాలను పంపిణీ చేశారు. రాత్రికి భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం స్వామివారికి ఊంజల్ సేవలను మనోహరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భక్తమండలి చైర్మన్ సత్తి బులి స్వామిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, సత్తి వీర్రాఘవరెడ్డి, సత్తి మనీష్, మల్లిడి ప్రభావతి, చేబ్రోలు శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై కార్యదర్శులకు శిక్షణ


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద తొట్లను పరిశీలిస్తున్న కార్యదర్శులు

మండపేట: ఘన వ్యర్థాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. మండలంలోని వెలగతోడులో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద కార్యదర్శి వీవీఆర్‌కే రాజు ఆధ్వర్యంలో 12 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో చెత్త సేకరణ, సంపద సృష్టిపై అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలతో ప్రమాదాలు


కోట రోడ్డులో ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా ఉన్న తుప్పలు

కె.గంగవరం: ఏటిగట్టుపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కోటిపల్లి నుంచి కోట వరకు ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా పెరిగి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికి తోడు తుప్పలు రోడ్డు మధ్య వరకు రావడంతో ఎదురుగా ఎదురుగా వచ్చే వాహనాలను కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర ఈ తుప్పలు ఏటిగట్టుకు ఇరువైపులా ఉన్నాయని, రెండు నెలల క్రితం తుప్పలను తొలగించి మళ్లీ ఎదిగిపోయాయని పూర్తిస్థాయిలో వీటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లైంగిక వేధింపులపై కేసు

మండపేట: ఓ సమస్య పరిష్కారానికి పెద్ద మనిషిగా వచ్చిన మండపేట పట్టణానికి చెందిన కొవ్వాడ అప్పన్నబాబు తనను లైంగికంగా వేధించాడని బుధవారం ఓ మహిళ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. తన కోరిక తీర్చకపోతే అంతు చూస్తానని అప్పన్నబాబు బెదిరించాడని తన ఫిర్యాదులో మహిళ పేర్కొంది. దీనిపై పట్టణ ఎస్సై హరికోటి శాస్త్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ

- గృహ విద్యుత్ వినియోగదారులకు సదవకాశం
- అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ


గృహ విద్యుత్ వినియోగం అంచనా ఊహాచిత్రం

రామచంద్రపురం రూరల్: దశాబ్దాల క్రితం విద్యుత్ కనెక్షన్ ఉండే ఇంటిలో ఒక బల్బు, ఒక ఫ్యాను అనే లెక్కల్లో పరిస్థితి ఉండేది. ప్రస్తుతం విద్యుత్ వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఫ్యాన్ల స్థానంలో ఏసీలు చేరాయి. వేడి నీళ్లకు హీటరు, దుస్తులు ఉతకడానికి వాషింగ్ మెషీన్, పిండి రుబ్బడానికి గ్రైండరు, ఇంకా ముందుకు పోతే ప్రస్తుతం మోటారు సైకిళ్లు, కార్లు సైతం విద్యుత్ ద్వారా పరుగులు పెడుతున్న తరుణంలో మనం వాడే అదనపు విద్యుత్‌ను క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రత్నాలరావు తెలియజేశారు.

అదనపు లోడ్ అంటే

గృహ విద్యుత్ అవసరాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో వాడే విద్యుత్ దీపాలు, గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి అవసరం మేరకు కిలోవాట్‌ల లెక్కన డెవలప్‌మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్‌లు కట్టించుకుంటారు. దానికి తగిన విధంగానే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ పరివర్తకాలు ఏర్పాటు చేశారు. అయితే అప్పటి అంచనాకు మించి అధిక విద్యుత్ ఉపకరణాలు వాడటం వల్ల విద్యుత్ వినియోగం పెరిగిపోయి తక్కువ లోడు కోసం ఏర్పాటు చేసిన పరివర్తకాలు తరచూ ట్రిప్ కావడం, లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తి వినియోగదారులు తరచూ ఇబ్బంది పడుతుంటారు.

50 శాతం రాయితీ

గృహాల్లో పెరిగిన అదనపు లోడు విద్యుత్ వినియోగాన్ని క్రమబద్ధీకరించుకోవడానికి ప్రస్తుతం ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తుంది. గతంలో ఒక కిలో వాట్ అదనపు లోడు కోసం క్రమబద్ధీకరించుకోవడానికి రూ. 2,000, డెవలప్‌మెంట్ చార్జీల నిమిత్తం రూ. 200 చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం 50 శాతం రాయితీతో కేవలం రూ.1,000 చెల్లిస్తే సరిపోతుంది. సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎటువంటి మార్పు ఉండదు.

జూన్ 30 చివరి తేదీ

విద్యుత్ కనెక్షన్ తీసుకున్న నాటికి ఇప్పటికీ విద్యుత్ వినియోగం మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగిపోయింది. విద్యుత్ అధికారులు తనిఖీల్లో అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గమనిస్తే జరిమానాలు విధించడంతో పాటు లో ఓల్టేజి లాంటి సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. దీనికి పరిష్కారంగా అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవడం ఉత్తమం. దీని కోసం జూన్ నెల 30వ తేదీ వరకు రాయితీ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

మండలం	గృహ విద్యుత్ వినియోగదారులు
రామచంద్రపురం	18,351
రామచంద్రపురం పట్టణం	19,276
కె.గంగవరం	17,681
కాజులూరు	18,662
మండపేట	22,759
రాయవరం	21,876
కపిలేశ్వరపురం	16,984

గృహ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని



ఈ నెల 1 నుంచి జూన్ 30 వరకు రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవడానికి విద్యుత్ నియంత్రణ మండలి అవకాశం కల్పించింది. వినియోగదారులు తమ పెరిగిన వినియోగాన్ని బట్టి అదనపు లోడుకు రాయితీలో 50 శాతం సొమ్ములు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి.

– కె. రత్నాలరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రామచంద్రపురం

పనిచేస్తూ ఉపాధి కూలీ మృతి


మృతురాలు గోవిందమ్మ (ఫైల్)

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో పనిచేస్తూ ఉపాధి హామీ కూలీ మృతి చెందినట్లు ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో అగస్టీన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మెడిశెట్టి గోవిందమ్మ (65) కొన్ని రోజులుగా తన కుటుంబ సభ్యులతో కలిసి పనిచేయడానికి వస్తుంది. ఎప్పటికి లాగే బుధవారం పనిచేస్తూ పది గంటల సమయంలో కళ్లు తిరిగి సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో ప్రథమ చికిత్స అనంతరం అనపర్తి పీహెచ్‌సీ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారాన్ని ఆమెకు అందించడానికి కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో పూజలు


అంగర వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో బుధవారం త్రయాహ్నిక ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ, సిద్ధయ్య విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సుడిదోమ జీవిత చక్రంపై అవగాహన అవసరం


తూటికాడ, పొగాకు కాడలతో సేంద్రియ కషాయాన్ని తయారు చేసి చూపిస్తున్న వ్యవసాయాధికారి రమేష్

కపిలేశ్వరపురం: వరిపంటను నాశనం చేసే సుడిదోమ జీవిత చక్రంపై రైతులకు అవగాహన అవసరమని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్ కుమార్ అన్నారు. నల్లూరు పిల్లి గోవింద్ వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి నిర్వహించారు. రబీ సాగులో మేలైన వ్యవసాయ పద్ధతులు అనే అంశంపై రైతులకు కేవీఎస్ రమేష్‌కుమార్ అవగాహన కల్పించారు. సుడిదోమ ప్రభావాలను నివారించేందుకు అవసరమైన సేంద్రియ కషాయాన్ని తయారు చేసే పద్ధతిని ప్రయోగాత్మకంగా వివరించారు. 10 కేజీల తూటి కాడ ఆకులు 10 లీటర్ల నీరు 10 కేజీల పొగాకు కాడలు, 10 లీటర్ల దేశీయ ఆవు మూత్రంతో కషాయాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. తూటికాడ, పొగాకు కాడలను మంచినీటిలో మూడు పొంగులు వచ్చే వరకూ మరిగించాలన్నారు. చల్లారిన తర్వాత ఆవు మూత్రాన్ని కలిపి వ్యవసాయ క్షేత్రంలో సాయంత్రం సమయంలో స్ప్రే చేయాలని వివరించారు. ఎకరాకు మూడు నుంచి ఐదు లీటర్లు తూటి కాడ, పొగాకు కాడల కషాయం, రెండు లీటర్లు ఆవు మూత్రంతో కూడిన మిశ్రమం సరిపోతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు యామిని దేవి, ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రతినిధి పి.దిలీప్, రైతులు పిల్లి మురళీకృష్ణ, నలమాటి విశ్వనాథం, పెనుమర్తి చిన్నబ్బాయి, సూరంపూడి వెంకట్రావు పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన


అవగాహన సదస్సుకు హాజరైన మహిళలు

మండపేట: నవజాత శిశువు దశ నుంచి ప్రీ స్కూల్స్ దశకు ఎదిగే వరకూ పిల్లల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని ఐటీసీ ప్రథమ్ సంస్థ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సత్యనారాయణ సూచించారు. ఈసీసీఈ డే సందర్భంగా బుధవారం మండలంలోని కేశవరంలో బాల్యారంభ సంరక్షణ, విద్య అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ పి.సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు ఆరోగ్య సూత్రాలు వివరించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గర్భిణులు పాల్గొన్నారు.

చర్చిలపై సర్వే చేయడం దారుణం


గోవిందరావు

మండపేట: పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా చర్చిలపై సర్వే నిర్వహించడం దారుణమని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది టీవీ గోవిందరావు అన్నారు. మండపేటలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పంచాయతీ రాజ్ శాఖ ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం సరికాదన్నారు. లౌకికరాజ్యంగా పేరుగాంచిన భారత దేశంలో అన్ని మతాలు సమానమే అన్నారు. పంచాయతీరాజ్ శాఖ గత నెల 10న జారీ చేసిన ఉత్తర్వులు రాష్ట్రంలో 26 జిల్లాల్లో పంచాయతీ అధికారులకు అందాయన్నారు. గ్రామాల్లో చర్చిలకు కలెక్టర్ అనుమతులు ఉన్నాయా ? లేవా ? అనే విషయంపై విచారణ జరుపుతున్నారన్నారు. ఈ ఉత్తర్వులు చట్ట విరుద్ధమని గోవిందరావు తెలిపారు. వెంటనే ఈ ఉత్తర్వులను నిలిపివేయాలని కోరారు.

నెరవేరని ముఖ్యమంత్రి హామీ ..

గతేడాది డిసెంబర్ 23న విజయవాడలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో నూతన చర్చిల నిర్మాణానికి, శిథిలావస్థలో ఉన్న చర్చిలను పునరుద్ధరించడానికి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఈ హామీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

'కొనగళ్ల'కు పరామర్శ


భాస్కరరావును పరామర్శిస్తున్న నాయకులు

మండపేట: సతీ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం నియోజకవర్గ కన్వీనర్ కొనగళ్ల భాస్కరరావును ఆ పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. చిన్న గొల్లపుంత వీధిలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. మృతురాలు సూర్యప్రభ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పెంకే గంగాధర్, నాయకులు లేగా వెంకన్న, సూరంపూడి సత్యప్రసాద్, పిఠాపురం సత్యనారాయణ, తాడి రామారావు, ఎం.మల్లేశ్వరరావు, పాలమాల సత్తిబాబు, దుగ్గిరాల రాంబాబు, నిమ్మలపూడి విరాటరాజు తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు


కె.గంగవరంలో మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

కె.గంగవరం: శివరాత్రి పర్వదినం దాటినప్పటి నుంచి రోజు రోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరగడంతో వేడికి చిన్నారులు, వృద్ధుల పాటు సామాన్య ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్డుపైకి రావాలంటేనే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సూర్యుడి ప్రతాపంతో పొలం పనులు చేసే కూలీలు, రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో సూర్యుడి ప్రతాపం ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎండ వేడిని భరించలేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. కిళ్లీ షాపులు, జ్యూస్ సెంటర్లు జనంతో కిటకిటలాడుతున్నాయి. రెండు రోజులుగా రామచంద్రపురం నియోజకవర్గంలో 35 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు కావడంతో గ్రామాలు నిప్పుల కొలిమిలా ఉన్నాయి.

8న మెగా రక్తదాన శిబిరం

మండపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న మండపేట పట్టణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇమ్మిడి నాగభూషణం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏటా మహిళా దినోత్సవం రోజున రక్తదాన శిబిరం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా వైశ్యా లేడీస్ వెల్ఫేర్ అసోసియేషన్, అమ్మ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. నాయుళ్ల గుడి వీధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. రక్తదానం చేసేందుకు వలంటీర్లు, దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

స్వచ్ఛతపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ


గ్రామాల్లో ప్రజలకు తడిచెత్త-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయవరం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛత వైపు అడుగులు వేస్తూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తడి-పొడి చెత్తల సేకరణ, హరిత రాయబారుల నియామకం, శుభ్రతకు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఈవోపీఆర్డీ సూచించారు.

స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దుతాం


మండపేటలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు (డీసీ ఫొటో)

మండపేట: పురపాలక సంఘాన్ని స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా కలువపువ్వు సెంటర్లో ఆయన మెప్మా ఆర్పీలతో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ మండపేట ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన రాజారత్న రోడ్డులోని శ్రీనగర్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి శుభ్రతపై అవగాహన కల్పించారు. మున్సిపల్ డీఈ కె.శ్రీనివాస్, ఏఈలు డి.పవన్‌కుమార్, బి.ఆంజనేయులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి


ఉన్నత విద్యపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

కాజులూరు: సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికా విద్యను ప్రోత్సహించాలని గొల్లపాలెం హైస్కూల్ హెచ్ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల వ్యక్తిత్వ వికాసంపై అవగాహన శిబిరం నిర్వహించారు. ప్రముఖ వక్త, యానం ఐటీఐ కళాశాల ఇన్‌స్పెక్టర్ లంక ప్రసాద్ తదితరులు పాల్గొని సమాజంలో బాలికా విద్య ఆవశ్యకతను వివరించారు. గ్రామాల్లో బాలికల చదువు 10వ తరగతితో ఆగిపోకుండా ఉన్నత విద్య వైపు పయనించేలా ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు.

పంటలపై అవసరాన్ని మించి మందులు వాడొద్దు

కాజులూరు: పంటలకు వ్యాపించే తెగుళ్లు, పురుగుల ఉధృతిని ఆధారంగా రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని అవసరాన్ని మించి మందుల వినియోగం అనర్థాలకు దారి తీస్తుందని మండల వ్యవసాయాధికారి వి అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం, చేదువాడలో ఏఓ అశోక్ పర్యటించి పంట పొలాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలపై రైతులు అవసరాన్ని మించి మందులు వాడుతున్నారని రెండు, మూడు రకాల మందులను కలిపి వాడుతుండటంతో ఏ మందూ పనిచేయక వృథా వ్యయం అవుతోందన్నారు. ఫలితంగా ఖర్చు పెరిగి రైతుల నికర ఆదాయం తగ్గుతుందన్నారు. అధికంగా మందుల వినియోగంతో మిత్ర పరుగులు చనిపోయి పంటకు మరింత హాని కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రమ్య, గ్రామ పెద్దలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

2,794 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

మండపేట: మారేడుబాకలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసిన నిందితుడు వాసంశెట్టి సాయికుమార్‌ను పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్సై హరికోటి శాస్త్రి కథనం ప్రకారం... మండపేటకు చెందిన నిందితుడు సాయికుమార్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కలిగి ఉన్నట్టు విశ్వసనీయవర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో బుధవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు మారేడుబాక పుంతరోడ్డులో బియ్యం ఉంచిన ప్రదేశాన్ని సోదా చేశారు. 2,794 కేజీల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శాస్త్రి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE
■3 Cents E/F Land for Sale in Housing Board Colony, Amalapuram. Contact : 7993833919 [HA-09393]

PLOT FOR SALE
■కేవలం 7.5లక్షలకే 25 సెంట్లు భూమి 100 ఎర్రచందనం మొక్కలతో కలిపి స్పాట్ రిజిస్ట్రేషన్ మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎర్రచందనం సాగు ఒక్కటే మార్గం. ✆ 98668 68887 [B-1266847]
■రాజమండ్రి రూరల్ కడియపుసావరం గ్రామ ఇళ్ళ మధ్య ఈస్ట్ ఫేసింగ్ 154 చ॥గ॥ & జగ్గంపేట మండలం కాట్రేవులపల్లిలో 200 గ॥ స్థలం అమ్మబడును.✆ : 89851 27289 [SCA-250019 53]

Services

GOLD FINANCE
■బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999 [B-2604]
■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2606]

Wanted
■రాజమండ్రి, నర్సీపట్నం, తునిలో ప్ర॥ కం॥ ప్రాజెక్ట్స్, షోరూమ్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్స్ కావలెను. జీ॥ 12 to 15 వేలు. రూం+భో. రాజ్ సెక్యూరిటీ దేవిచౌక్, రాజమండ్రి - ✆ : 93922 69369 [R-35]

■మెకానిక్ హెల్పర్లు కావలెను. జీతము 15000/- నుండి 18,000/- వరకు, శ్రీదేవి హోండా ఆథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మెయిన్ రోడ్, కాకినాడ ✆ : 94909 98888 [R-131]
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693 [HA-99983]
■ త్రినేత్ర హోంకేర్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ :18K. , Ph : 8520980099, 8520874499 [HA-1902]
■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు వార్డ్ బాయ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15160]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.